# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-08-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. అంతర్జాతీయ ప్రమాణాలతో పాటు అమరావతి రాజధాని ప్రత్యేకతను ప్రతిబింబించేలా భవనాల రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి 365ను రెండు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు 840 కోట్ల 41 లక్షల రూపాయలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరి వెల్లడించారు.**

**3. తెలంగాణలో గతంలో రద్దైన కోయగూడెం బొగ్గు బ్లాక్‌పై హైకోర్టు స్టే తొలగిపోయిందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు.**

**4. 'మిలాద్ ఉన్ నబీ' సందర్భంగా ముస్లిం సోదరులకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సహా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.**

==========================

అంతర్జాతీయ ప్రమాణాలతో పాటు అమరావతి రాజధాని ప్రత్యేకతను ప్రతిబింబించేలా భవనాల రూపకల్పన, లోపలి ఆకృతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న సచివాలయం, శాసనసభ, హైకోర్టు భవనాల లోపలి ఆకృతులపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్కిటెక్ట్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధుల బృందం ఈ సందర్భంగా భవనాల లోపలి ఆకృతులు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రదర్శించింది. ఈ డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి 365 పరిధిలోని బుట్టాయిగూడెం నుంచి లక్ష్మీనారాయణదేవి పేట, పట్టిసీమ నుంచి కొవ్వూరు సెక్షన్లను రెండు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు 840 కోట్ల 41 లక్షల రూపాయలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు. మొత్తం 45.09 కిలోమీటర్ల మేర ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ రహదారి అభివృద్ధితో పోలవరం సాగునీటి ప్రాజెక్టుతో పాటు పరిసర గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుందని పేర్కొన్నారు. వ్యవసాయపరంగా కీలకమైన ఈ ప్రాంతంలో పొగాకు,

చెరకు, ఆయిల్‌పామ్ వంటి పంటల ఉత్పత్తులను మార్కెట్లకు వేగంగా, సురక్షితంగా తరలించేందుకు వీలు కలుగుతుందని, తద్వారా రైతులకు మెరుగైన మార్కెట్ అనుసంధానం, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్ట్ మంజూరుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మంత్రి నితిన్ గడ్కరీలకు రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.

-----------------------------

తెలంగాణలో గతంలో రద్దైన కోయగూడెం బొగ్గు బ్లాక్‌పై హైకోర్టు స్టే తొలగిపోయిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. రాబోయే బొగ్గు వేలంలో ఆ బ్లాక్‌ను చేర్చి సింగరేణి సంస్థకు కేటాయించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఢిల్లీలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. సకాలంలో బొగ్గు ఉత్పత్తి చేయని కారణంగా కేటాయింపులు రద్దయినట్లు పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

-----------------------------

ముస్లిం సోదరులకు 'మిలాద్ ఉన్ నబీ' సందర్భంగా పలువురు ప్రముఖులు  శుభాకాంక్షలు తెలిపారు. 'మహమ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ప్రేమ, సౌభ్రాతృత్వం, ధర్మానికి స్ఫూర్తిదాయ ప్రతీకగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. తోటి ప్రజలకు విశ్వాసం, నమ్మకం, శ్రద్ధ, కరుణతో సేవ చేసినప్పుడే ప్రవక్త లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి 'మిలాద్ ఉన్ నబీ' శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

-----------------------------

జూనియర్ డాక్టర్ల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిమితులను దృష్టిలో ఉంచుకుని.. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ డాక్టర్లకు అందుతున్న ఉపకార వేతనం, ఇతర ప్రయోజనాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి నిన్న చర్చించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్..25 సెకన్లు

-----------------------------

ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీలను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అభినందించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్‌తో కలిసి గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని నిన్న కలిశారు. ఈ సందర్భంగా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించినందుకు ముఖ్యమంత్రి వారిని అభినందించారు. క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

-----------------------------

ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అనే తన మాటను అమలులో చూపించిన... నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా జయంతి ఈరోజు. ప్రస్తుత మాసిడోనియాలో 1910 ఆగస్టు 26వ తేదీన ఆమె జన్మించారు. ఎక్కడో పుట్టి సేవ చేయాలనే సంకల్పంతో భారత్‌కు వచ్చిన ఆమె... కలకత్తాలో కుష్టు వ్యాధిగ్రస్తులకు సేవ చేశారు. సేవ అనే పేరు గుర్తుకురాగానే మదర్ థెరిస్సా పేరును గుర్తుచేసుకునే స్థాయిలో ఆమె ప్రజల మనస్సులో స్థానం సంపాదించారు. మానవసేవ కన్నా మిన్న లేదని చాటిన మదర్ థెరిస్సా...భారత్‌లో ఆపన్నులు, ఆర్తులు, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందువరుసలో నిలిచి.. ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన వనితగా గుర్తింపు పొందారు.

---------------------------

రాష్ట్రంలో ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుంటూ వన మహోత్సవం లక్ష్యాలను అధిగమించాలని తెలంగాణ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల అధికారులతో మంత్రి నిన్న దృశ్యమాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు, నీటి సంరక్షణ, జీవనోపాధి, ఆస్తుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముందుగానే ప్రారంభించి ఇప్పటికే 86 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6 కోట్ల 18 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5 కోట్ల 32 లక్షలకు పైగా మొక్కలు నాటినట్టు మంత్రి పేర్కొన్నారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం, రుతుపవన ద్రోణి విస్తరించి ఉన్నట్లు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ వెల్లడించారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 137వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 28వ తేదీ వరకు పంపవచ్చు.

=====================